సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 29 । నవంబర్ । 2024



వంగడాల ఎంపిక కీలకం

తొలకరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతుండగా.. దాళ్వాకు రైతులు సిద్ధమవుతున్నారు. వంగడాల ఎంపిక కీలకమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో ▸



దొంగల ముఠా అరెస్ట్

దోపిడీ దొంగల ముఠాను భీమవరంలో పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. ముఠాలో తొమ్మిది మందిని అరెస్ట్ చేయగా ముగ్గురు పరారీలో ఉన్నారు. 8లో ▸



క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ అన్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

మధ్యవర్తులను నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు మధ్యవర్తుల చేతుల్లో మోసపోతున్నారని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రేంట్స్ హైదరాబాద్ ప్రోత్సాహంతో గురువారం స్థానిక విష్ణు కళాశాలలో జిల్లా విదేశీ ఉపాధి అవకాశాలు–మోసాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు, వ్యక్తుల ఆధ్వర్యంలో చట్టపరమైన ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచించారు. నకిలీ ఏజెంట్లు, సంస్థల ప్రతినిధుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రేంట్స్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధి ఎం.రవికుమార్ మాట్లాడుతూ నకిలీ ఏజెంట్ల చేతుల్లో మోసపోతే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 1800113090 లేదా 011-26885021కు తెలియజేసి సహాయం పొందవచ్చన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు అనుమతులు తప్పనిసరి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఫిజియోథెరఫీ, డయాగ్నోస్టిక్ సెంటర్లను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వర రావు హెచ్చరించారు. గురువారం జిల్లాలో పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. రెన్యూవల్ కోసం గడువులోపు నమోదు చేసుకోవాలని, ఆస్పత్రి ఆవరణలో రోగులకు సదుపాయాలు, తాగునీరు ఏర్పాట్లు చేయాలన్నారు. రికార్డులు, రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, పరీక్షల ఫీజు ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. నోటిఫైడ్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, కుక్కకాటు, పాముకాటు వివరాలను ప్రభుత్వం పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అందరూ తప్పక పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్తమ ఏరియా ఆస్పత్రులుగా తాడేపల్లిగూడెం, నూజివీడు

ఏలూరు టౌన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించటంతో పాటు ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత, సౌకర్యాల కల్పన విషయంలో సత్ఫలితాలు సాధించిన పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని తాడేపల్లిగూడెం, నూజివీడు ఏరియా ఆస్పత్రులు పురస్కారాలు పొందాయి. రాష్ట్రంలోనే బెస్ట్ ఏరియా ఆస్పత్రులుగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, శుభ్రత, ఆరోగ్య సేవల విషయంలో ఆస్పత్రులకు ప్రభుత్వం ప్రథమ, ద్వితీయ కేటగిరీల్లో అవార్డులు, నగదు బహుమతులు అందజేస్తుంది. గురువారం ఈ అవార్డులను ప్రకటిస్తూ ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి బెస్ట్ ఏరియా ఆస్పత్రిగా 97 మార్కులు సాధించి రూ.10 లక్షలు, నూజివీడు ఏరియా ఆస్పత్రి ద్వితీయ స్థానంలో 94.63 మార్కులు సాధించి రూ.7.5 లక్షలు నగదు బహుమతులను కైవసం చేసుకున్నాయి.

జిల్లా కేంద్రాల్లోనే శిక్షణ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రెసిడెన్షియల్ శిక్షణ కారణంగా ఉపాధ్యాయుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ శిక్షణను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏలూరు డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఆగిరిపల్లిలో నిర్వహించిన రెసిడెన్షియల్ శిక్షణలో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందగా గురువారం విజయనగరం జిల్లా గజపతినగరంలో మరో ఉపాధ్యాయుడు కన్నుమూయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇటువంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా ఎంతమంది ఉపాధ్యాయులను బలి తీసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, బీటీఏ, ఏపీటీఎఫ్ 1938, ఆపస్, డీటీఎఫ్, ఎస్‌టీయూ, ఎన్‌టీఏ, ఏపీఎస్‌టీఏ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అప్పు చేసి వైద్యం

పేరుపాలేనికి చెందిన ఎస్.వెంకట్రావుకు నెల రోజుల క్రితం గుండెపోటు రాగా రేషన్, హెల్త్ కార్డులు తీసుకుని విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. స్టెంట్ వేయాల్సిన అవసరం ఉందని చెప్పిన వైద్యులు హెల్త్‌కార్డులో వెంకట్రావు పేరు లేకపోవడాన్ని గుర్తించి ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేయలేమని చెప్పారు. మార్పులు చేర్పులు చేసేందుకు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో **ఆయన రూ.8 లక్షలు అప్పు చేసి హైదరాబాద్‌లో వైద్యం చేయించుకున్నారు.**



సేవలు షట్‌డౌన్

ఎన్నికల నేపథ్యంలో మార్చి నెలాఖరు నుంచి పౌర సేవలకు సంబంధించిన పలు సైట్లను ప్రభుత్వం నిలిపివేసింది. రేషన్, హెల్త్ కార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, పింఛన్ల మంజూరు, బీమా, పెళ్లి కానుక తదితర పథకాలు, పౌర సేవలకు సంబంధించి ఆయా వెబ్‌సైట్లలోని ఆప్షన్లు క్లోజ్ అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

బీమా అందక భారం

పాలకోడేరుకు చెందిన ఎల్.నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఇంటి యజమాని మరణంతో ఆ కుటుంబం ఆదరువు కోల్పోయింది. ఆ కుటుంబానికి బీమా సాయం వర్తిస్తున్నా సైట్ ఓపెన్ కాకపోవడంతో సాయం కోసం అప్‌లోడ్ చేసే వీలులేకుండా పోయింది. కనీసం మట్టి ఖర్చులకు కూడా సాయం అందలేదు.




నాడు

2019 జూన్‌లో పాలన పగ్గాలు చేపట్టిందే తడవు సంక్షేమాన్ని పరుగులు పెట్టించే పనిలో పడ్డారు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పాలనను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో జూలైలోనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అదే ఏడాది అక్టోబరు 2న సచివాలయ వ్యవస్థను ప్రారంభించి 500కు పైగా పౌర సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.


నేడు

రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరి ఆరు నెలలు కావస్తున్నా ఎన్నికల వాగ్దానాల అమలుకు ప్రభుత్వం పిల్లి మొగ్గలు వేస్తోంది. సంక్షేమ పథకాలు, పౌర సేవలకు సంబంధించిన వెబ్‌సైట్లను ఇంకా తెరవకుండా బ్లాక్‌లోనే ఉంచింది. ప్రభుత్వ పథకాల విధివిధానాలను ఖరారు చేయకుండా కాలయాపన చేస్తుండటంతో ప్రజలు ఎదురుచూపులు చూడాల్సి వస్తోంది. పలు సేవలు, పథకాల లబ్ధి అందక అవస్థలు పడుతున్నారు.

- ఎన్నికల ముందు మూతపడ్డ ప్రభుత్వ వెబ్‌సైట్లు
- ఆరు నెలలు గడిచినా ఆప్షన్లు ఓపెన్ చేయని కూటమి సర్కారు
- అప్‌లోడ్ కాని దరఖాస్తులు
- నిలిచిన రేషన్ కార్డు, పింఛన్, హెల్త్ కార్డుల మంజూరు
- పేదలకు అందని పెళ్లి కానుక, బీమా తదితర పథకాలు
- దరఖాస్తుల స్వీకరణకు నిరాకరిస్తున్న అధికారులు
- ప్రభుత్వ సాయం అందక పేదల అగచాట్లు



కూటమి ప్రభుత్వంలో ఇంకా ఓపెన్ కాని కొత్త రేషన్ కార్డుల ఆప్షన్



గత ప్రభుత్వంలో కొత్త కార్డుల దరఖాస్తుల కోసం వెబ్‌సైట్‌లో కనిపిస్తున్న ఆప్షన్

సాక్షి, భీమవరం: కొలువుదీరి ఆరు నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం సైట్లను ఓపెన్ చేయకపోవడంతో ఆయా సేవలు, పథకాలకు సంబంధించిన దరఖాస్తులు అప్‌లోడ్ చేసే వీలు లేకుండా పోయింది. ఎన్నికల వాగ్దానాల అమలులో మీనమేషాలు లెక్కిస్తున్న సర్కారు కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు తదితర వాటికి సంబంధించి మార్గదర్శకాలు ఇవ్వలేదు. దీంతో వాటి కోసం ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. గతంలో నిర్ణీత రోజుల్లో పరిష్కారమయ్యే ఆయా సేవలు ఇప్పుడు నెలలు గడుస్తున్నా అందక పేద వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రేషన్ కార్డులు ఎప్పుడో?



బియ్యం కార్డులకు సంబంధించి సైట్ ఓపెన్ కాక కొత్త కార్డుల మంజూరు, పుట్టిన పిల్లలను కార్డులో చేర్చడం, చనిపోయినవారి పేర్ల తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. అక్షర దోషాలకు సంబంధించి కరెక్షన్లు కావడం లేదు. కేవలం వలస కార్మికుల దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది.

హెల్త్ కార్డులు దూరం



అత్యవసర వైద్యసేవల సమయంలో పేద వర్గాల వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు ఎంతో భరోసానిచ్చేవి. సాంకేతికపరమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే సరిచేసి వైద్యసేవలు అందించేందుకు వీలుండేది. ప్రస్తుతం ఈ సైట్‌లోని పలు ఆప్షన్లు ఇంకా క్లోజ్‌లోనే ఉండటంతో వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

బీమాకు లేదు ధీమా



సాధారణ, ప్రమాద రూపంలో ఇంటి యజమానిని కోల్పోయిన కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా గత ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. సాధారణ మరణం అయితే రూ.లక్ష, ప్రమాద బీమా అయితే రూ.5 లక్షలు సాయం అందించేది. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. ఈ పథకం పాలసీ గడువు జూన్ 31తో ముగిసిపోయింది. సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.10 లక్షలు బీమా సాయం అందిస్తామని గతంలో హామీలు ఇచ్చిన కూటమి నాయకులు.. ఇంకా సైట్ కూడా ఓపెన్ చేయలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా అనేక బాధిత కుటుంబాలు సాయం కోసం ఎదురుచూస్తున్నాయి.

విలపింఛన్



గత ప్రభుత్వం ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేది. ఈ ఏడాది జనవరిలో 4,274 కొత్త పింఛన్లు అందజేసింది. తర్వాత వచ్చిన దరఖాస్తులను జూలైలో మంజూరు చేసేందుకు ఆన్‌లైన్ చేస్తూ వచ్చారు. సైట్ క్లోజ్ అయ్యే నాటికి దాదాపు 4,350 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు. సార్వత్రిక ఎన్నికల నాటికి జిల్లాలో 2,34,161 పింఛన్లు ఉన్నాయి. ప్రస్తుతం కొత్త పింఛన్ల మంజూరు లేకపోగా వివిధ కారణాలతో 4,977 పింఛన్లను తొలగించడంతో వాటి సంఖ్య 2,29,184కు తగ్గింది. సైట్ ఓపెన్ కాక కొత్త పింఛన్ల కోసం సుమారు 12 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

అందని పెళ్లి కానుక



పేద వర్గాల వారి వివాహ వేడుకకు పెళ్లి కానుక ద్వారా ప్రభుత్వం సాయం అందించేది. బీసీ సామాజికవర్గం వారికి వివాహ కానుకగా రూ.50 వేలు, వధూవరుల్లో ఎవరికైనా వైకల్యం ఉంటే రూ.75 వేలు, ఎస్సీ సామాజిక వర్గం వారికి రూ.లక్ష, ఎవరికైనా వైకల్యం ఉంటే రూ.1.5 లక్షలు, బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందినవారు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.2 లక్షలు సాయంగా అందించేది. ఇప్పుడు ఆ సైట్ ఓపెన్ కాకపోవడంతో దరఖాస్తు చేసుకునే వీలులేక ఆయా వర్గాలకు సాయం అందడం లేదు.

పేరెంట్స్ మీటింగ్‌కు కోడ్ పట్టదా!

- 7న సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశం
- 12 వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- ప్రజాప్రతినిధులతో సమావేశాలపై అభ్యంతరాలు
- వాయిదా వేయాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు



భీమవరం: ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ డిసెంబర్ 7న నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర విస్మయం వ్యక్తమవుతోంది. అలాగే 7న సుబ్రహ్మణ్య షష్టి కావడంతో సమావేశాలు ఎలా నిర్వహించాలని ప్రశ్నిస్తున్నారు. 5న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనుండగా.. 12 వరకు కోడ్ అమలులో ఉంది. ఈ సమయంలో కొత్తగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టే అవకాశం లేదు. అయితే మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ అట్టహాసంగా నిర్వహించాలని, సమావేశాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో పాటు 9వ తేదీ నుంచి విద్యార్థులకు అర్ధ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల ముందు సమావేశాలు పెట్టడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ కోసం మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఆగిరిపల్లి, రాజానగరంలో శిక్షణ ఇవ్వడంతో పాఠశాలల్లో బోధనా నిర్వహణ కష్టమవుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అలాగే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. విద్యార్థులకు పరీక్షల సమయంలో తమకు అదనపు బాధ్యతలు అప్పగిస్తే ఎలా అని ఉపాధ్యాయులు అంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, సంక్షేమ, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు మొత్తంగా 1,375 పాఠశాలల్లో మీటింగ్ నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశాలివ్వడంపై ఉపాధ్యాయుల్లో చర్చ సాగుతోంది.

రైల్వేగేటు మూసివేత

ఆకివీడు: మరమ్మతుల దృష్ట్యా ఈనెల 30 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకూ మండలంలోని దుంపగడప గ్రామంలోని రైల్వే గేటు (మొండి గేటు)ను మూసివేస్తున్నట్టు కైకలూరుకు చెందిన రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దుంపగడప–ఆకివీడు రోడ్డులో లెవిల్ క్రాసింగ్ నెం.95 రైల్వే గేటును శనివారం ఉదయం 7 గంటలకు మూసివేస్తామన్నారు.

తుపానుపై అప్రమత్తం

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచన



రైతులతో మాట్లాడుతున్న జేసీ

పాలకొల్లు అర్బన్: తుపాను కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, రైతులు అప్రమత్తం కావాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని శివదేవుని చిక్కాల, బల్లిపాడు, లంకలకోడేరు, పాలమూరు గ్రామాల్లో గురువారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఒక్క ధాన్యం గింజ కూడా తడవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కస్టోడియన్ అధికారులు రైస్ మిల్లుల వద్ద అందుబాటులో లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పూర్తిస్థాయిలో గోనె సంచులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. వీలైనంత త్వరగా కల్లాల్లో ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని, తూకంలో తేడాలుంటే సహించబోమన్నారు. ధాన్యం భద్రపరచుకోవడానికి అవకాశం లేని రైతులు మండల అధికారులను సంప్రదించాలన్నారు. రైతులకు నచ్చిన మిల్లులకు ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, ఏఓ కె.రాజశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

ఫూలేను స్ఫూర్తిగా తీసుకోవాలి

మాజీ మంత్రి కారుమూరి



తణుకులో జ్యోతిరావు ఫూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: అంటరానితనం, కులవ్యవస్థను నిర్మూలించి స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చిన మహనీయులు జ్యోతిరావు ఫూలే అని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. జ్యోతిరావు ఫూలే వర్ధంతి సందర్భంగా గురువారం రాష్ట్రపతి రోడ్డులోని ఫూలే విగ్రహాలకు కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సామాజిక సమానత్వాన్ని కలిగించి అందరూ సమానమే అనే భావన తీసుకువచ్చిన ఫూలేను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ఫూలేను నిత్యం గుర్తుచేసుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాట్ల సురేష్, ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కర్రి గంగాధర అప్పారావు, సాక్షి గోపాలరావు, షేక్ జిలానీ, వై.రామకృష్ణ, గెద్దాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రులకు ప్రత్యేకాధికారుల నియామకం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో మధ్యాహ్నం నుంచి స్పెషలిస్టులు రావడం లేదని ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ నాగరాణి అన్నారు. కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, స్పెషలిస్టులు, వైద్యాధికారులతో జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఫిర్యాదుల నేపథ్యంలో ఆస్పత్రుల పర్యవేక్షణ నిమిత్తం జిల్లాలోని 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 4 ఏరియా హాస్పిటల్స్, 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక జిల్లా హాస్పటల్‌కు మొత్తంగా 64 మంది ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రోజూ ఆస్పత్రుల పనితీరు, అవుట్, ఇన్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలు, ఆస్పత్రిని పురోగతిలోకి తీసుకురావడానికి తీసుకోవాల్సిన అంశాలను అధ్యయనం చేసి, సాయంత్రంలోపు నివేదిక అందించాలని ప్రత్యేక అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

17 రోజులు.. రూ.1.84 కోట్లు



ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం లెక్కించారు. చిన వెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. 17 రోజులకు నగదు రూపేణా రూ.1,84,31,118తో పాటు కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 381 గ్రాముల బంగారం, 4.485 కిలోల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.500, రూ.1,000, రూ.2,000 నోట్ల ద్వారా రూ.10 వేలు లభించినట్టు చెప్పారు. లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. - ద్వారకాతిరుమల

జిల్లా అభివృద్ధికి విజన్ 2047



భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాను ప్రత్యేక స్థానంలో నిలిపేలా విజన్ 2047 డాక్యుమెంట్ రూపకల్పన ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విజన్ 2047 డాక్యుమెంట్ రూపకల్పన, జిల్లాలో అమలవుతున్న కార్యక్రమాల ప్రగతి, రాష్ట్రస్థాయిలో చర్చించాల్సిన, ఫ్లాగ్ చేయాల్సిన తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉండేలా డాక్యుమెంట్‌ను పకడ్బందీగా రూపొందించాలన్నారు. ఇప్పటికే తయారుచేసిన డాక్యుమెంట్లను పరిశీలించి లోటుపాట్లను సరిచేయాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్ల గుంతలు పూడ్చివేత, పంచాయతీరాజ్ శాఖలో చేపట్టిన భవన నిర్మాణ పనులు, పల్లె పండుగలో చేపట్టిన రోడ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఎస్‌టీపీ ప్లాంట్‌లు, డంపింగ్‌యార్డుల నిర్వహణపై సూచనలిచ్చారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎం.మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

బీచ్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



బీచ్ వాలీబాల్ పోటీల్లో విజేతలు

గణపవరం: బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో నిర్వహించిన బీచ్ వాలీబాల్ పోటీల్లో గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి అఖిల్‌వర్మ నాలుగోస్థానం సాధించాడు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో ఈ విజయం సాధించినట్లు పీడీ పద్మావతి తెలిపారు. అఖిల్‌వర్మను హెచ్‌ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొల్లేరు పరిరక్షణలో భాగస్వాములు కావాలి

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): కొల్లేరు సరస్సు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు జేసీ రాహుల్ కుమార్ రెడ్డి కొల్లేరు బఫర్ జోన్ నిర్ధారణకు సంబంధించిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరు పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇందుకు సంబంధిత గ్రామాల ప్రజల సహకారం అవసరం అన్నారు. ఎన్జీటీ నిబంధనల మేరకు కొల్లేరు ప్లస్–5 కాంటూరు నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఏకోసిస్టం బఫర్ జోన్ ఏర్పాటుకు సంబంధిత గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి అభిప్రాయాలను సేకరించాలన్నారు. అనంతరం ప్రతిపాదనలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, పశ్చిమగోదావరి జిల్లా డీఎఫ్‌ఓ ఆశా కిరణ్, ఏలూరు వైల్డ్ లైఫ్ డీఎఫ్‌ఓ బి.విజయ, పీసీబీ ఈఈ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'రాజీవ్ రంజన్‌మిశ్రా కమిషన్ చెల్లదు'



పిప్పరలో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

గణపవరం : ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలని మాలసంఘాల జాతీయాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. గురువారం గణపవరం మండలం పిప్పరలో జరిగిన మాలమహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని 338 ఆర్టికల్ ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ ఉన్నందున వేరే కమిషన్ నియమించడం చెల్లదన్నారు. ఈనెల 29వ తేదీన కర్నూలు జిల్లా ఆదోనిలో జరిగే మాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయడానికి మాలలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ఎస్.జయపాల్, ప్రేమ్‌కుమార్, రణదీప్, అచ్చిబాబు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి గల్లంతు

ఉంగుటూరు: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరుకు చెందిన యర్రారపు గంగరాజు (60) కోనేరుపేట సమీపంలోని కాలువరేవులో గురువారం స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. ఫైర్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై చెప్పారు.

● శంభో శంకరా..



హర నామస్మరణతో పంచారామక్షేత్రం మార్మోగింది. కార్తీకమాసం త్రయోదశి సందర్భంగా గురువారం భీమవరం పంచారామ క్షేత్రంలోని శ్రీ ఉమా సోమేశ్వరస్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. విశేషాలంకరణలో దర్శనమిచ్చిన ఆ మహాదేవుణ్ణి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– భీమవరం (ప్రకాశం చౌక్)

● కార్తీక దీపోత్సవం



కార్తీక మాసం చివరి గురువారం సందర్భంగా భక్తులు భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ వెంకట సాయిబాబా మందిరంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మందిర చైర్మన్ మల్లినీడి తిరుమల రావు (బాబీ) పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిపారు. సాయిబాబా, ఓం కారం ఆకృతిలో దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

– భీమవరం

● రైతుకు వాయు'గండం'



పంట చేతికి అందే సమయంలో రైతులకు వాతావరణం రూపంలో గండం ఎదురైంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రరూపం దాల్చి రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. దీంతో రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు పరుగులు పెడుతున్నారు. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని బరకాలు కప్పి రక్షించేందుకు ప్రయాస పడుతున్నారు.

– పెంటపాడు

వంగడాల ఎంపిక కీలకం

- ముమ్మరంగా తొలకరి మాసూళ్లు
- కోతలు పూర్తయిన చోట దాళ్వాకు రైతులు సన్నద్ధం
- చీడపీడలను తట్టుకునే వంగడాలను ఎంపిక చేసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



కాటన్‌దొర సన్నాలు



చంద్ర వంగడం



సుజాత (ఎంటీయూ 1210)

సాక్షి, భీమవరం: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఓ వైపు ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా జరుగుతుండగానే.. రబీ సాగు సందడి కనిపిస్తోంది. తొలకరి పంటను ఒబ్బిడి చేసుకుంటూనే దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాల్లోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల పరిధిలో రబీ వరి విస్తీర్ణం దాదాపు 7.55 లక్షల ఎకరాలు కాగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 4.51 లక్షలు ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 3.04 లక్షల ఎకరాల్లో సాగు జరుగనుంది. ముందుగా వరికోతలు పూర్తయిన పలుచోట్ల నారుమడులు పోసేందుకు రైతులు ఇప్పటికే పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే రకాలను, మేలైన యాజమాన్య పద్ధతులపై మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీ కృష్ణాజీ రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. నాట్లు పద్ధతిలో సాగుచేసే రైతులు డిసెంబరు నెలాఖరులోగా నాట్లు పూర్తిచేయాలని, వెదజల్లు పద్ధతిని అవలంబించే రైతులు డిసెంబరు మొదటి వారంలోపు విత్తుకోవాలని చెబుతున్నారు.

వంగడాల ఎంపిక ముఖ్యం

దాళ్వాలో 120 నుంచి 125 రోజుల పంటకాలం కలిగి, దోమపోటు, అగ్గితెగులును తట్టుకుని, గింజరాలిక తక్కువగా ఉండే వంగడాలను సాగుచేయాలి. సాధారణ భూముల్లో శ్రీధృతి (ఎంటీయూ–1121), తరంగిణి (ఎంటీయూ–1156), చంద్ర (ఎంటీయూ–1153), ఎంటీయూ 1010 (కాటన్ దొర సన్నాలు), ఎంటీయూ–3626 (ప్రభాత్), నెల్లూరు మసూరి (ఎన్.ఎల్.ఆర్ - 34449), సుజాత (ఎంటీయూ–1210), ఎంటీయూ రైస్ 1293, ఎంటీయూ రైస్ 1273, ఎన్.ఎల్.ఆర్– 3238, నెల్లూరు ధాన్యరాశి (ఎన్.ఎల్.ఆర్–3354), శ్వేత (ఎన్.ఎల్.ఆర్–40024) రకాలను ఎంపిక చేసుకోవాలి. అలాగే చౌడు భూముల్లో సాగుకోసం ఎంటీయూ రైస్ 1293, నెల్లూరు మసూరి (ఎన్.ఎల్.ఆర్–34449), సోమశిల (ఎన్.ఎల్. ఆర్–33358), నెల్లూరు ధాన్యరాశి (ఎన్.ఎల్.ఆర్– 3354) రకాలను విత్తాలి. ఆలస్యంగా సాగు చేపట్టేందుకు తరంగిణి (ఎంటీయూ–1156), చంద్ర (ఎంటీయూ–1153), ఎంటీయూ–1010 (కాటన్ దొర సన్నాలు), నెల్లూరు ధాన్యరాశి (ఎన్.ఎల్.ఆర్–3354) రకాలను, దోమపోటు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో శ్రీధృతి (ఎంటీయూ–1121), తరంగిణి (ఎంటీయూ–1156), చంద్ర (ఎంటీయూ –1153), ఎంటీయూ–1010 (కాటన్‌దొర సన్నాలు) సాగు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

విత్తన మోతాదు

నాట్లు వేసే విధానంలో ఎకరానికి 20 కిలోలు, పొడి విత్తనం వెదజల్లే పద్ధతిలో 25–30 కిలోలు, మండి కట్టిన విత్తనం వెదజల్లే పద్ధతిలో 12–15 కిలోలు, గొర్రుతో విత్తే పద్ధతిలో 15–20 కిలోలు, శ్రీ పద్ధతిలో 2 కిలోలు, యంత్రాలతో నాటే విధానంలో 12–15 కిలోలు, బెంగాల్ నాట్ల విధానంలో 8–10 కిలోల విత్తనం అవసరం అవుతుంది. యంత్రాలతో సాగు చేసేటప్పుడు, బెంగాల్ నాట్ల విధానంలో లేతనారు (15–20 రోజుల వయస్సు) వినియోగించాలి.

నారుమడుల తయారీలో జాగ్రత్తలు

నాట్లు వేయడానికి నెలరోజుల ముందుగానే నారుమడిని తయారు చేసుకోవాలి. నారుమడికి ఎంపిక చేసిన భూమిని 10–15 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ముచేసి ఎత్తుపల్లాలు లేకుండా చదును చేయాలి. ఐదు సెంట్ల నేలలో పెంచిన నారు ఒక ఎకరాకు సరిపోతుంది. ప్రతి ఐదు సెంట్ల నారుమడికి 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 2.2 కిలోల యూరియా, 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చివర దమ్ములో వేసుకోవాలి. విత్తనం చల్లిన 10–15 రోజులకు మరో 2.2 కిలోల యూరియా పైపాటుగా వేసుకోవాలి.

కలుపు నివారణ

నారుమడిలో కలుపు నివారణకు ప్రతి 5 సెంట్లకు 75 మి.లీ బెంథియోకార్బ్ లేదా 50 మి.లీ బుటాక్లోర్ లేదా 5గ్రా. పెరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. నారు ఎదిగే దశలో ఇంకా కలుపు ఉన్నట్లయితే 12–15 రోజులలోపు సైహలోఫాప్ బ్యుటైల్ ద్రావకం 20 మి.లీ 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.



డాక్టర్ ఎంపీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం

ఆక్వా విద్యుత్ సమస్యలపై మంత్రికి ఏకరువు



భీమవరంలో విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

భీమవరం: ఆక్వా రంగంలో రైతులు తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఏకరువు పెట్టారు. కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను పరామర్శించడానికి గురువారం భీమవరం వచ్చిన ఆయన్ను ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కొందరు ఆక్వా రైతులు కలిసి సమస్యలు వివరించారు. రొయ్యలు, చేపల చెరువుల వద్ద ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని, ఇది చిన్న, సన్నకారులు రైతులు కష్టతరంగా మారిందన్నారు. ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఇద్దరు, ముగ్గురు రైతులు చెరువులకు విద్యుత్ సౌకర్యం పొందేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. లోఓల్టేజీతో రొయ్యల హేచరీలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోందని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని మంత్రిని హేచరీ యజమానులు కోరారు. అలాగే సీజనల్ సబ్సిడీపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. అనంతరం మంత్రి రవికుమార్ విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి పెట్టాలని, కొత్త సబ్ స్టేషన్లను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, విద్యుత్‌శాఖ జిల్లా ఎస్‌ఈ రఘునాధబాబు, పెద్దాపురం, జగ్గంపేట, అమలాపురం, భీమవరం, నరసాపురం డీఈలు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వె.ప్రసన్న వెంకటేష్
- పెదవేగిలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వె. ప్రసన్న వెంకటేష్

పెదవేగి: విద్యతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో రాష్ట్ర స్థాయి క్రీడల పోటీలను గురువారం ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో విజయం అనేది నిరంతర అభ్యాసనతో సాధ్యపడుతుందన్నారు. ఉపాధ్యాయులు క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన బూట్లు, క్రీడా సామాగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయుల వివరాలు ఫొటోలతో సహా తమ శాఖ మ్యాగజైన్‌లో ప్రచురించి మరింత ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్ జాడ్యం లేకపోవడంతో నిజమైన క్రీడలను అభ్యసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సంస్థ అకాడమీ మోనటరింగ్ అధికారి ఎస్. సంజీవరావు, ఎ.మురళీకృష్ణ, బీవీ మల్లేశ్వరరావు, ఏలూరు జిల్లా ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ సంస్థ ఏలూరు, తూర్పు, కృష్ణా జిల్లాల సమన్వయ అధికారులు ఎస్.భారతి, జీ వెంకట్రావు, కే ప్రేమావతి పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: దోపిడి దొంగల ముఠాను భీమవరంలో పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. దొంగల ముఠాలో 9 మంది అరెస్ట్ చేయగా ముగ్గురు పరారీలో ఉన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి వివరాలు వెల్లడించారు. దోపిడీకి ప్రధాన సూత్రధారి అయిన కాకినాడ జిల్లా పెదపూడి మండలం రాజుపూడి గ్రామానికి చెందిన గంపల ఆనందబాబు గతంలో వ్యాపారి. కొంతకాలం ఇంటర్నేషనల్ కార్పొరేషన్ నేచురల్ ప్రొడక్ట్స్ వ్యాపారం చేసి నష్టపోయాడు. అనంతరం ధనవంతుల ఇళ్లలో దోచుకుని విలాసవంతమైన జీవితం గడపాలని నిర్ణయించుకున్నాడు. దీనిలో భాగంగా భీమవరం పట్టణం వంశీకృష్ణనగర్ ప్రాంతంలోని వేగేశ్న రంగరాజు ఇంటిని ఎంచుకున్నాడు. దోపిడీకి ఆనందబాబు అతని స్నేహితుడు బత్తిన రవీంద్రకుమార్ కలసి పథకం రచించారు. అయితే ఇందుకోసం రవీంద్రకుమార్ తన స్నేహితుడైన గోనిపాటి నానితో దోపిడీకి గ్యాంగ్‌ను తయారుచేయమన్నాడు. దీంతో మొత్తం 12 మందితో ముఠా తయారైంది. వీరంతా ఈనెల 10, 20 తేదీల్లో రాత్రి సమయంలో రెక్కీ నిర్వహించారు. అనంతరం ఈనెల 23వ తేదీన రెండు కార్లలో కత్తులు, ఇనుపరాడ్లు, సుత్తి వంటి మారణాయుధాలతో దోపిడీకి ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వాచ్‌మెన్, ఇంటి యజమాని రంగరాజు గట్టిగా కేకలు వేయడంతో పారిపోయారు. మరలా ఈనెల 27వ తేదీన ఆ ముఠాలోని 9 మంది సభ్యులు పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ వద్ద ఉండగా టూటౌన్ సీఐ జి కాళీచరణ్‌కి సమాచారం అందడంతో తన సిబ్బందితో దాడిచేశారు. దొంగల ముఠాలోని ప్రధాన సూత్రధారి గంపల ఆనందబాబుతో సహ ముఠా సభ్యులు బత్తిన రవీంద్రకుమార్, గోనుపాటి నానిబాబు, దడాల శివశంకర్, గుంట రత్నకుమార్, దొంతుమల్ల శ్యామ్, ఉప్పు కుమార్‌రాజు, గంటశాల భవానీశంకర్, నొక్కు నానిబాబులను అరెస్టు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. ముఠాలోని దార్ల దుర్గానవీన్, గెద్దాడ శ్యామ్‌సత్యవరప్రసాద్, చింటూ పరారీలో ఉన్నారన్నారు. దొంగలముఠాను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన సీఐ కాళీచరణ్ ఇతర సిబ్బందిని ఎస్పీ క్యాష్ రివార్డ్స్‌తో అభినందిచారు. విలేకర్ల సమావేశంలో అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, భీమవరం డీఎస్పీ రావూరి జయసూర్య, సీఐ కాళీచరణ్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ : 18K. Ph: 9160900024, 9640400073 [HA-1385]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 9182260297 [HA-99132]

■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. 9380269951 [G-9090]



■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:- టెన్త్ to డిగ్రీ, Sal:- 20k-30k మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. సం:8121818692 [G-9087]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12,000. సంప్ర।। 95507 45296. [V- 6609]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చెడు వ్యసనాలకు లోనై బైక్‌ల చోరీ



ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్ వద్ద నిందితుడిని, బైక్‌లను చూపుతున్న భీమడోలు సీఐ విల్సన్, ఎస్సై సుధీర్, సిబ్బంది

ద్వారకాతిరుమల : చెడు వ్యసనాలకు లోనై, డబ్బు కోసం బైక్‌లను చోరీ చేస్తున్న ఒక విద్యార్థిని స్థానిక ఎస్సై టి.సుధీర్ ద్వారకాతిరుమల శివారులో శుద్ధగనుల వద్ద గురువారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భీమడోలు సీఐ యుజే విల్సన్, ఎస్సై సుధీర్ వివరాలను వెల్లడించారు. కాకినాడ (యానాం రోడ్డు)లోని డ్రైవర్స్ కాలనీకి చెందిన 20 ఏళ్ల సంగిరెడ్డి వీర గణేష్ వర్మ కొన్నాళ్లుగా ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, ములగుంటపాడు గ్రామంలో నివసిస్తున్నాడు. ప్రస్తుతం ఏలూరులోని ఒక హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చెడు వ్యసనాలకు బానిస అయిన అతడు సులువుగా డబ్బు సంపాదించేందుకు బైక్‌ల చోరీ పాల్పడుతున్నారు. శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చే భక్తుల బైక్‌లను మాయం చేస్తున్నాడు. దీనిపై నిఘా పెట్టిన ఎస్సై సుధీర్ నిందితుడు వీర గణేష్ వర్మను అరెస్టు చేసి, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అందులో రెండు (హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్, హీరో గ్లామర్) బైక్‌లు క్షేత్రంలో, మరో (హీరో స్ప్లెండర్ ప్లస్) బైక్ విజయవాడ బస్టాండ్ వద్ద దొంగిలించినవిగా నిర్ధారించారు. ఇదిలా ఉంటే నిందితుడు వీర గణేష్ వర్మ గతంలో ఉండి పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడినట్టు విచారణలో తేలింది.

కమ్మనైన అమ్మ భాష తెలుగు



పెనుగొండ ఎస్వీకేపీలో రిజిస్ట్రార్ సుధాకర్‌ను సత్కరిస్తున్న పాలకవర్గం, కవులు

పెనుగొండ: అమ్మ నేర్పిన తెలుగు భాష కమ్మనైనదని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ కొనియాడారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో మద్రాసు విశ్వవిద్యాలయం, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు సదస్సు ముగింపు సమావేశం గురువారం రాత్రి జరిగింది. ఈ సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ విశ్వర్షి వాసిలీ వాఙ్మయ వరివస్య వసంతకుమార్ రాసిన పుస్తకాలు సమాజాన్ని, తెలుగు లోకాన్ని ఎంతో ప్రభావితం చేస్తాయన్నారు. రచనా శైలి అద్భుతంగా ఉందని, వాసిలీ సాహిత్యాన్ని పరిశోధన దిశగా తీసుకోవాలని కోరారు. ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి అందరూ కలసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వనపర్తి సత్యనారాయణవాసులు సాహిత్యాన్ని గేయాలుగా అలపించి ఆకట్టుకున్నారు. అనంతరం రిజిస్ట్రార్ సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అణుశక్తి శాస్త్రవేత్త జీఏజీకే మూర్తి, పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ టి నాగిరెడ్డి, విశ్రాంత ఆచార్య డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు, కేవీ ఎండీ వరప్రసాద్, సంకురాత్రి సూర్యనారాయణ, తెలుగు విభాగ అధ్యాపకులు అదషా, సురేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

గోదావరిలో పడి మత్స్యకారుడు మృతి

యలమంచిలి: గోదావరిలో పడి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం గంగడుపాలెం గ్రామానికి చెందిన పొన్నమండ శ్రీనివాస్ (39) బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై అతని భార్య వెంకటరమణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్రీడి గుర్రయ్య తెలిపారు. మృతదేహానికి శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వివరించారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా): గంజాయి కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డొంకరాయి ఎస్సై శివకుమార్ తెలిపారు. బుధవారం డొంకరాయి పోలీసుస్టేషన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కిలోల గంజాయిని బైక్‌పై తరలిస్తూ ఇద్దరు పట్టుబడ్డారన్నారు. వీరు జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన వీపు వెంకటేష్, మరిగల మణికంఠగా గుర్తించామన్నారు.

క్లుప్తంగా

వీరేశ్వరస్వామికి విశేష పూజలు



వీరేశ్వరస్వామి వారిని విశేషంగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారి దేవస్థానంలో గురువారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి గ్రామానికి చెందిన బసివిరెడ్డి ఉదయభాస్కరరావు, నాగదుర్గ దంపతులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు విరివిగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కడియద్దలో అవగాహన ర్యాలీ



కడియద్ద గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: జాతీయ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా గురువారం మండలంలోని కడియద్ద గ్రామంలో హైస్కూలు విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు ప్రధానోపాధ్యాయుడు డీవీవీఎస్ఎన్. మూర్తి మాట్లాడుతూ వయోభేదం లేకుండా చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులను అరికట్టేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివకుమార్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, సీహెచ్‌వో సత్తిబాబు, ఎంపీహెచ్ఏ రోషణ బేగం, ఆశాలు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ దశిక వంశీ

అత్తిలి: ఆరోగ్యకేంద్రంలో అందించే వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దశిక వంశీ చెప్పారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రత్యేక అధికారిగా నియమితులైన తహసీల్దార్ గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రం పరిశుభ్రంగా ఉందని, కుక్కకాటు వ్యాక్సిన్‌లు, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

వరి మాసూళ్లు వాయిదా వేసుకోవాలి



ప్రత్తిపాడులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

పెంటపాడు: బంగాళాఖాతంలో తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఏవో పార్థసారధిలు పేర్కొన్నారు. రాష్ట్ర విపత్తుల సంస్థ జారీ చేసిన సూచనలకు అనుగుణంగా రైతులను అప్రమత్తం చేసే పనిలో భాగంగా వారు అలంపురం, ప్రత్తిపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. కోసిన ధాన్యం తక్షణం ఒబ్బిడి చేసుకోవాలన్నారు. ఒక వేళ తుపాను వల్ల ధాన్యం తడిస్తే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని చల్లుకోవాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పక పాటించాలన్నారు.

దళారులను నమ్మొద్దు



రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇరగవరం: రైతులు దళారులు నమ్మి మోసపోవద్దని ఇరగవరం తహసీల్దార్ సుందరరాజు తెలిపారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల రైతులు అప్రమత్తంగా ఉండి ప్రస్తుతం కోతలు ఆపుకోవాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దన్నారు. ఈ సమావేశంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న ప్రైవేటు బడి బస్సుల వేగం

- ప్రాణాలుపోతున్నా మార్పురాని వైనం
- వీధుల్లోను తూనీగల్లా ప్రయాణం
- భయ పడుతున్న ప్రయాణికులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా అంటున్న ప్రజానీకం



తణుకు జాతీయ రహదారిపై తిరగబడ్డ డాక్టర్ కేకేఆర్ స్కూలు బస్సు (ఫైల్)

తణుకు అర్బన్: తణుకు పట్టణ పరిధిలో ప్రైవేటు స్కూల్ బస్సుల వేగానికి ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళ్లే క్రమంలోను తిరిగి ఇంటికి తీసుకువెళ్లే సందర్భాల్లోను కొన్ని బస్సుల డ్రైవర్లు బస్సు నడుపుతున్న తీరు పాదచారులు, ద్విచక్రవాహనదారులను భయాందోళనకు గురిచేస్తుందని ఆరోపిస్తున్నారు. మీదకు వచ్చిన బస్సును అడ్డుకోవాలని ప్రయత్నించే సందర్భాల్లో వేగంగా ఉడాయిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. బస్సుల్లో చిన్నారులు ఉన్నారనే జ్ఞానం లేకుండా బస్సులు వేగంగా నడుపుతున్నారంటూ కోపోద్రిక్తులవుతున్నారు. ఇటీవల కాలంలో ఈ ప్రైవేటు బస్సుల కారణంగా అమాయకుల ప్రాణాలు బలైపోతున్నాయి. ఇటు అధికారు లు, అటు పాఠశాల యాజమాన్యాలు కూడా పట్టించుకోవడంలేదని తణుకువాసులు ఆరోపిస్తున్నారు. తణుకు రవాణా కార్యాలయం పరిధిలోని 5 మండలాల్లో ఉన్న ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 230 బస్సులు వరకు ఉన్నాయి. అయితే కొన్ని బస్సుల్లో డ్రైవర్లు విధుల్లో కూడా మద్యం సేవించి ఉంటున్నారని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని విద్యార్థులే చెబుతుండడం విశేషం.

సజ్జాపురం వీధుల్లో కలకలం...

తణుకు సజ్జాపురం వీధుల్లో ఉదయం, సాయంత్రం ప్రైవేటు పాఠశాలల బస్సుల్లో కొన్ని బస్సులు ప్రయాణిస్తున్న తీరు స్థానికులకు ఆగ్రహం తెప్పిస్తోంది. ముఖ్యంగా కోయాక్సిల్ రోడ్డు మీదుగా అండర్‌పాస్ నుంచి జాతీయ రహదారి ఎక్కే బస్సులతో పాటు స్త్రీసమాజం, రైల్వే స్టేషన్ రోడ్డుల్లో తిరిగే బస్సుల వేగ విధ్వంసంపై స్థానికులు నోరెళ్లబెడుతున్నారు. కోయాక్సిల్ రోడ్డును ఆనుకుని పలు ప్రైవేటు పాఠశాలలు, ఆస్పత్రులు ఉండడం, ఆయా పాఠశాలలకు, ఆస్పత్రులకు వెళ్తూ, వచ్చే చిన్నారుల పక్క నుంచి బస్సులు దూసుకుపోతున్న వేగానికి ఏ నిముషంలో ఏం జరుగుతుందోనని పిల్లల తల్లిదండ్రులు, స్థానిక నివాసితులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల బస్సుల్లో వేగ నియంత్రణలో భాగంగా గంటకు 60 కిలోమీటర్లకు కట్ ఆఫ్ ఉన్నప్పటికీ జాతీయ రహదారిపై వెళ్లాల్సిన వేగాన్ని చిన్నపాటి సందుల్లో కూడా పాటిస్తుండడం భయాందోళనలను రేకెత్తిస్తోంది.

ఇటీవలి కాలంలో ముగ్గురు మృతి..

ఇటీవల కాలంలో మూడు ప్రమాదాల్లో ఒక బస్సు క్లీనరుతోపాటు ఒక వ్యక్తి, ఒక చిన్నారి అసువులు బాసారు. ఈనెల 20వ తేదీన తణుకు జాతీయ రహదారి డీమార్టు ప్రాంతంలో తణుకులోని ఒక ప్రైవేటు బస్సు డ్రైవరు అతివేగంతో బస్సు నడిపిన కారణంగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపునకు వెళ్లి తిరగబడిన ఘటనలో లిఫ్టుకోసం ప్రైవేటు బస్సు ఎక్కిన మరొక బస్సు క్లీనర్ మేళం ప్రవీణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ ఘటనలో బస్సు ఎంత వేగంగా వెళ్తే ఇంతటి ప్రమాదం సంభవించిందో తెలుస్తోంది. గతేడాది అత్తిలి మండలం పాలి గ్రామంలో అత్తిలికి చెందిన ప్రైవేటు పాఠశాల బస్సు నుంచి దిగిన ఒక చిన్నారిని గమనించని డ్రైవరు అదే బస్సు ఎక్కించి చిదిమేసిన ఘటన ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసింది. తణుకు శివారు ఇరగవరం రోడ్డులో తణుకుకు చెందిన ప్రైవేటు పాఠశాల బస్సు ఒక వ్యక్తిని ఢీకొట్టగా అక్కడికక్కడే మృత్యువాత పడిన ఘటన



ప్రమాద ప్రాంతంలో బస్సు క్లీనర్ మేళం ప్రవీణ్‌కుమార్ మృతదేహం (ఫైల్)

కూడా బస్సు వేగమే కారణమని స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఇటువంటి ఘటనలు జరుగుతున్నా కొన్ని బస్సుల వేగంలో మాత్రం మార్పురాకపోవడం శోచనీయం.

బస్సులు వేగంగా నడిపితే కఠిన చర్యలు



ప్రైవేటు పాఠశాలల బస్సుల వేగంగా ప్రయాణించడం నేరం. చిన్నారులు ప్రయాణించే బస్సులు వీధుల్లో కూడా వేగంగా వెళ్లడాన్ని సహించం. వేగంగా వెళ్లే బస్సులపై రవాణా చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటాం. బస్సుల యాజమాన్యాలతో మాట్లాడి డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం. ఏ ప్రైవేటు పాఠశాల బస్సుపైన ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమ కార్యాలయానికి ఫిర్యాదుచేయవచ్చు. నిబంధనలు పాటించని యాజమాన్యాలు, డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

– ఎస్.శ్రీనివాస్, తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్

వెలగని వీధి దీపాలు



స్థానిక 2వ వార్డులో వీధి దీపాలు వెలగని దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీనికి తోడు దొంగల బెడద అధికంగా ఉంటుందని, ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని స్థితి ఉంటుందని, అధికారులు తక్షణమే స్పందించి వీధిలైట్లు రాత్రి సమయాల్లో వెలిగే విధంగా చూడాలని, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పురపాలక సంఘం అధికారుల వివరణ అడుగగా తక్షణమే వీధి దీపాల మరమ్మతులు చేపడతామని తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సుల ప్రయాణాల్లో ఫిర్యాదులు, సలహాలు, సూచనల సేకరణలో భాగంగా శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఫోన్‌చేయదలచిన ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు 99592 25484 నంబరులో తనను సంప్రదించాలని, తణుకు ఆర్టీసీ డిపో ద్వారా మరింత మెరుగైన సేవలు పొందేందుకు తమ విలువైన సూచనలను తెలపాల్సిందిగా ఆయన కోరారు.

బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



తాడేపల్లిగూడెం అర్బన్: జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తణుకు అర్బన్: జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కామేష్

తాడేపల్లిగూడెం అర్బన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే పలువురు వ్యక్తులు కొనియాడారు. గురువారం తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్ డిపో సమీపంలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, చిటికిన ప్రసాద్, కర్రి భాస్కరరావు, బండారు నాగు, చెన్నా జనార్ధన్, బొద్దాని శ్రీను, మహ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే వర్ధంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలే విగ్రహానికి బీసీ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశీ, అత్తిలి బాబి, సుధీర్, చిన్న, అల్లు నాగు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

తణుకు టౌన్: కుల వివక్షకు వ్యతిరేకంగా, బలహీన వర్గాల అభ్యున్నతికి అవిరళ కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకమని తణుకు ఎస్కేఎస్ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ చెప్పారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీ శివప్రకాష్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు



ఇరగవరం: మండల కార్యాలయంలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో

ఘనంగా పూలే వర్ధంతి

ఇరగవరం: మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తణుకు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

తణుకు అర్బన్: జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు టి.కోటేశ్వరరావు, చోడే గోపి, వేంద్ర రవి, కత్తుల జెస్‌పాల్, వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



డి.సత్యవతి

తణుకు అర్బన్: వచ్చేనెల 14వ తేదీన తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. తణుకు కోర్టులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కక్షిదారులు రాజీకాదగ్గ ప్రతి కేసును రాజీ చేసుకుని తమ విలువైన కాలాన్ని, డబ్బును సద్వినియోగం చేసుకునే విధంగా ఆలోచించాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసేందుకు న్యాయస్థానం కృషి చేస్తుందని, రాజీమార్గమే రాజమార్గంగా కక్షిదారులు ఆలోచన చేయాలని కోరారు. రాజీ అయ్యే క్రిమినల్ కేసులతో పాటు కుటుంబ తగాదాలు, భార్యాభర్తల భరణం, డొమెస్టిక్ వయొలెన్స్, మోటారు వాహనాల ప్రమాద కేసులు, బ్యాంక్ బకాయిలు, ప్రామిసరీ నోటు, భూతగాదాలు, సివిల్ కేసులు రాజీచేసుకోవచ్చని స్పష్టం చేశారు. కక్షిదారులు తమ కేసును రాజీ చేసుకోవాలనే ఉద్దేశ్యంలోకి వస్తే వెంటనే పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయసేవల సిబ్బందిని సంప్రదించాలని కోరారు. జాతీయ న్యాయసేవల సంస్థ టోల్‌ఫ్రీ నంబరు 15100లోగాని, మండల న్యాయసేవల కమిటీ నంబరు 08819–241133లో సంప్రదించవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు అర్బన్: తణుకు, అత్తిలి, పైడిపర్రు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో బ్యాంక్ కాలనీ, రైల్వేస్టేషన్, యాపిల్ హస్పిటల్, ఎస్ఎస్సీ బోస్ రోడ్డు, నరేంద్ర సెంటర్, వేల్పూరు రోడ్డు, రూరల్ పరిధిలో మండపాక, పైడిపర్రు గ్రామాల్లోని ఇండస్ట్రియల్ సర్వీస్‌లకు, అత్తిలి మండలంలోని ఆరవల్లి, మంచిలి, దంతుపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వన్ టౌన్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్‌టౌన్‌లోని హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో నిట్ ఫీడర్, రైల్వే ఫీడర్, రిలయన్స్ ఫీడర్, సత్యవతినగర్ ఫీడర్లకు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 29వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. నిట్ కళాశాల, కోతిబొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్డు, భూపాల్ నగర్, గవర్నమెంట్ ఆసుపత్రి, మామిడి తోట, గవర్నమెంట్ పాలిటెక్నిక్, హౌసింగ్‌బోర్డు, శశి కళాశాల, గణేష్ నగర్, మిలిటరీ కాలనీ, గాంధీ బొమ్మసెంటర్, సత్యవతినగర్, వీకర్స్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, బాపూజీ పుంత రోడ్డులలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

టూ టౌన్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే:

టూ టౌన్‌లో టౌన్ ఫీడర్‌కు సంబంధించి జువ్వలపాలెం నుంచి సవిత్రపేట వరకు ఈ నెల 29వ తేదీ శుక్రవారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వివిధ ప్రాంతాలు జువ్వలపాలెం, సవిత్ర పేట, మార్కెట్ ఏరియా, నవారుపేట, ఏలూరు రోడ్డు, తణుకు రోడ్డు పరిసర ప్రాంతాలలోను అదే విధంగా పడాల ఫీడర్‌కు సంబంధించి పడాల, పడాల గరువు, ముత్యాలంభపురం, యాగర్లపల్లి పరిసర ప్రాంతాలలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఆరుగొలను, దండగర్ర, కొత్తూరు, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, ఆరుళ్ల, నందమూరు, మారంపల్లి, వీరంపాలెం సబ్ స్టేషన్ పరిధి వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదాతకు వరుణ గండం

- వర్షాలతో వణికి పోతున్న రైతన్నలు
- ముమ్మరంగా ఖరీఫ్ వరి కోతలు
- కోతల సమయంలో చిరు జల్లులతో ఆందోళన



మండలంలో హడావుడిగా మసూళ్లు చేస్తున్న రైతులు

పెంటపాడు: ఖరీఫ్ కోతలు యంత్రాల సాయంతో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరాకు 30బస్తాలు పైడి దిగుబడులు వస్తున్నాయి. ఆశించిన దిగుబడులు అందుకుంటున్న తరుణంలో రైతన్నలను వరుణుడు వణికిస్తున్నాడు. పిలవకుండానే చినుకులతో పలకరిస్తుండటంతో చేతికి అందివచ్చిన పంట ఏమైపోతుందోననే భయంతో అన్నదాతలు వణికి పోతున్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఖరీఫ్ వరి గింజ కట్టే దశలో ఉంటే నియోజకవర్గంలో మాత్రం చాలా చోట్ల కోతలు ప్రారంభమయ్యాయి. అయితే ఈ సీజనల్ ప్రారంభం నుంచి ప్రకృతి వైపరీత్యాలు రైతన్నలను వెంటాడుతూనే ఉన్నాయి. అయినా అన్నింటినీ అధిగమించి సాగుతో ముందడుగు వేసిన అన్నదాతలను పిలువకుండానే పలకరిస్తున్న వర్షాలు కంగారు పెట్టిస్తున్నాయి. ఒడిదుడుకులను అధిగమించి, పంటను పండించిన వారికి ఆ పంట చేతికి అందే తరుణంలో అల్ప పీడనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఆందోళనకు గురి చేస్తోంది.

నాటిన చోటనే నాటారు..

సాధారణంగా వరి నాట్లు అయినా తర్వాత పంట చేతికి వచ్చే వరకు పలు రకాలు ఎరువులు, పురుగుమందులు పంటకు వాడుతూ మంచి దిగుబడులు అందుకునేందుకు రైతులు తాపత్రయ పడుతుంటారు. అయితే ఈ సీజనల్‌లో తరుచు అల్ప పీడనాలు, తుఫాన్లు సంభవించడంతో కొన్ని చోట్ల నాటిన నాట్లు ముంపుకు గురై పాడేపోవడంతో నాటిన చోటనే మరోసారి నాట్లు వేయవలసి వచ్చింది. ఈ విధంగా ఖర్చులు అధికమయ్యాయి. అయినప్పటికీ తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడంతో దిగుబడులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశల మేరకు దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్న తరుణంలో బంగాళాఖాతంలో అల్ప పీడనం కారణంగా వర్షాలు కురియనున్నాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు కంగారు పడుతున్నారు.

ముమ్మరంగా వరి కోతలు...

ప్రస్తుతం నియోజకవర్గంలో పలు చోట్ల వరి పంట కోతలు యంత్రాల సాయంతో ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలో పెంటపాడు, తాడేపల్లిగూడెం రూరల్ ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు కోతలు పూర్తిగా కాగా మరి కొన్ని ప్రాంతాల్లో కోతలకు సిద్ధంగా ఉంటే మరికొన్ని పొలాలలో గింజతొడిగే దశలో వరి పంట ఉంది. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు కోసిన వెంటనే మిల్లర్లు పొలాల నుంచే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయంలో వర్షాలు కురియడం వలన ఆ ధాన్యం తడిచి, మిల్లర్లు కొనుగోలు చేయడానికి అవకాశం లేకుండా పోతుందని వాపోతున్నారు. అలాగే వరి పంట గింజ కట్టే పొలాలలో గాలులతో కూడిన వర్షాలకు పంట నెలకొరిగితే పంట దెబ్బతిని పొల్లుగా మారుతుందని భయపడుతున్నారు.

గింజ కట్టే పొలాలకు దెబ్బ

ప్రస్తుత సమయంలో వర్షాలు కురియడం వ్యవసాయానికి ముఖ్యంగా వరి పంటకు అంతమంచిది కాదు. ఈ ఏడాది రైతులు ఒకటికి రెండు సార్లు వరి నాట్లు వేసి ఎన్నో వ్యయ ప్రయాసలు పడ్డారు. అందివచ్చిన పంటను దక్కించుకునే సమయంలో వర్షాలు కురిస్తే పంట దెబ్బతింటుంది. కోతలు జరిగే చోట ధాన్యం తడిచిపోయి మొలకలు వస్తాయి. గింజ కట్టే దశలో ఉన్న పంట పొల్లుగా మారుతుంది.

వర్షాలు ఇప్పుడు మంచిదికాదు

గ్రామాల్లో వరికోతలు పూర్తయ్యే సమయం వచ్చింది. ఈ తరుణంలో వర్షం వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. అక్కడక్కడా యంత్రాలతో కోతలు జరుగుతున్నాయి. ఈ సమయంలో వర్షం వస్తే మంచిదికాదు. ధాన్యం తడిస్తే అమ్ముకొనేందుకు వీలు కాదు.

– మండల వ్యవసాయాధికారి, కె. పార్థసారధి

గూడెంను ప్రథమస్థాయిలో నిలపండి



మాట్లాడుతున్న కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: అర్బన్ హెల్త్‌సెంటర్లలో సేవలను సంపూర్ణంగా అందజేయడంలో మునిసిపాలిటీని ప్రథమ స్థాయిలో నిలపాలని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. పట్టణంలోని కడకట్ల, వీకర్స్‌కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్లకు కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకాధికారిగా నియమించిన సందర్భంగా గురువారం ఆయన చాంబర్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న సర్వేలు, హెల్త్ సెక్రటరీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్ష చేసి తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏఎస్ఓ కె.సురేష్, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. ముందుగా మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు గురువారం ఉదయం 23, 24 వార్డులలో ఆకస్మికంగా పర్యటించారు. వార్డులలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ధాన్యం విక్రయాలను త్వరగా పూర్తి చేయండి



దువ్వలో రైతులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తణుకు టౌన్: మాసూళ్లు పూర్తి చేసిన రైతులు ధాన్యం విక్రయాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం తణుకు మండలం దువ్వ గ్రామంలోని పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కల్పించిన మద్దతు ధరకు ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయాలన్నారు. రైతులు కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎంవీ రమేష్, మండల వ్యవసాయ అధికారి కె కుసుమ, రైతులు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలకు దాతలు సేవలు అందించడం అభినందనీయమని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్కే బాలీశ్వరయ్య కొనియాడారు. దాతలు ఆధ్వర్యంలో గురువారం భవిత దివ్యాంగులకు బిస్కెట్స్, కేక్స్, చాక్లెట్స్, విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పిల్లలను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సేవా కార్యక్రమంలో చిక్కాల నాగరాజు, సూర్యగణేష్, ప్రత్యేక ఉపాధ్యాయిని చంద్రకుమారి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.